# ఆత్మహత్యలా? హత్యలా?

ఒకప్పుడు జపాన్ దేశంలో ఆత్మహత్యలు ఎక్కువగా జరుగుతుండేవట. జపానీస్ భాషలో ఆత్మహత్యను "హరాకిరీ" అంటారు. ఎవరైనా తెలివితక్కువ పనిచేసి పదవినో, ఆస్తినో పోగొట్టుకుంటే "హరాకిరి" చేసుకున్నాడని అంటుండేవాళ్ళు.

చాలా ఆశ్చర్యంగా ఇప్పుడు భారతదేశంలో కూడా ఆత్మహత్యలు చేసుకునే వాళ్ళ సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. పత్తిరైతులు, చేనేత కార్మికులు, కార్పొరేట్ కాలేజీల్లో చదువుకునే విద్యార్థినీ విద్యార్థులు, భగ్న ప్రేమికులు - ఇలా సమాజంలోని వివిధ వర్గాలకు చెందిన ప్రజలు ఆత్మహత్యలకు పాల్పడటం చాలా బాధను, ఆందోళనను కల్గిస్తున్నాయి.

ఆత్మహత్యలకు కారణం మానసిక సమస్యలా? లేక ఆర్థిక సమస్యలా? ప్రేమలో వైఫల్యమా? చాలామంది అనుకుంటున్నట్టు తాత్కాలిక ఆవేశంతోటే ఆత్మహత్యలకు పాల్పడతారా? ఇవేవీ కాకుండా ఇంకేవైనా కారణాలున్నాయా? ఈ అంశం మీద పరిశోధన చేసి ఓ మంచి రిపోర్టును, మా జర్నలిస్టుల భాషలో స్టోరీ అంటారు... మాకివ్వాలని ఓ ప్రముఖ దినపత్రిక నన్ను కోరింది.

నేను ఫ్రీలాన్స్ జర్నలిస్టును. నన్ను చాలా పత్రికల వాళ్ళు ఇలాంటి పరిశోధనాత్మక స్టోరీస్‌ని ఇవ్వమని అడుగుతుంటారు. ఈసారి నన్ను తెలంగాణా ప్రాంతంలో జరుగుతున్న పత్తిరైతుల ఆత్మహత్యల మీద ఓ పరిశోధనాత్మక స్టోరీని ఇవ్వమని ఒక ప్రముఖ దినపత్రిక నన్ను కోరింది. ఈ సమస్య మీద పరిశోధన చెయ్యాలన్న గాఢమైన కోరిక నాక్కూడా ఉంది.

వరంగల్ నగరానికి చాలా దగ్గర్లోనే ఉండే కొత్తపల్లి అనే ఊర్లో చాలామంది పత్తిరైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని నాకు తెలుసు. అందువల్ల, ప్రప్రథమంగా ఆ ఊరినుండే నా పరిశోధనను మొదలెట్టాలని నిర్ణయించుకొని నా మోటారుబైక్ మీద కొత్తపల్లికి బయల్దేరాను.

ఉదయం తొమ్మిదిగంటల ప్రాంతంలో కొత్తపల్లికి చాలా సమీపంలో ఉన్న ఓ మామిడితోటలో కాస్సేపు ఆగాను. ఆ మామిడితోటకు కొంచెం దూరంలో ఉన్న ఓ సమాధి ముందు కూర్చొని నెత్తీనోరు బాదుకుంటూ పెద్దగా రోదిస్తున్న ఓ స్త్రీ మీదకు నా దృష్టి మళ్ళింది. అప్పుడే సైకిల్ మీద ఆ మామిడి తోటలోకి ప్రవేశించిన ఓ మధ్య వయస్కున్ని

"మీది ఈ ఊరేనా?" అని అడిగాను.

"ఔన"ని అతడు చెప్పగానే

"ఆ సమాధి ముందు కూర్చొని రోదిస్తున్న ఆమెవరో నీకు తెలుసా?" అన్నాను.

"ఎరికే" అన్నాడతడు.

"ఆమె అంత బిగ్గరగా, వింటున్న వాళ్ళ గుండెలు అవిసిపోయేలా, ఎందుకేడుస్తున్నదో చెప్పగలవా?"

"దాని మొగుడు సత్తిగాడు... పురుగుమందు తాగి చచ్చిపోయిండు... ఆ యేడుస్తున్నది వాని పెండ్లం..."

"ఆ ఆత్మహత్య చేసుకున్న సత్తెయ్య పత్తిరైతేనా?"

"ఔ... పత్తిరైతుగనుకనే చచ్చిండు... కొత్తగొచ్చినయని పత్తి విత్తనాలు తెచ్చి పత్తి పండించిండు. విత్తనాల మీద, ఎరువుల మీద, పురుగుమందుల మీద మస్తు పెట్టుబడి పెట్టిండు గని కలిసి రాలే... మస్తు అప్పులయినయి... సత్తిగాడే కాదు... మా ఊర్లె చానామంది పత్తి పండించిండ్రు... రెండుమూడుసార్లు బాగనే పండించిండ్రు... బాగనే లాభాలు తీసిండ్రు... మొదట్ల కొద్దిమందే గా పత్తి పండించిండ్రు... వాళ్ళకు లాభాలు రాంగనే ఒకనితర్వాతొకరు పత్తికోసం ఎగబడ్డరు. వరంగల్లుకు బొయి విత్తనాలు తెచ్చిండ్రు... ఎరువులు తెచ్చిండ్రు... పురుగు మందులు తెచ్చిండ్రు... బాంకోళ్ళు అప్పులు సుత ఇచ్చిండ్రు... యేమైందో యేమోగని.... చానామంది దెబ్బతిన్నరు... ఒకని తర్వాతొకడు ఆత్మహత్యలు జేసుకున్నరు... గీ సత్తిగాడు బాగా బతికినోడే... కొత్తగొచ్చిన పత్తి జోలికి బొయి దెబ్బతిన్నడు... మా ఊర్లే ఆత్మహత్య జేసుకొని చచ్చినోళ్ళల్ల వీడు ఎనిమిదోడు... నీకింకా గీసంగతి తప్సీలుగ తెలుసుకోవాలని ఉంటే మొగని సమాధి ముందు కూకోని యేడుస్తున్న గామె దగ్గరకు పో... ఆమె పేరు గౌరమ్మ. గౌరి అన్ని సంగతులు పూసగుచ్చినట్లు చెప్పుతది. పాపం... వాడు సచ్చినంక గా సమాధిని అదే కట్టించింది. రోజోసారొచ్చి గా సమాధి ముందు కూకోని ఓ గంటసేపు గట్ల యేడ్చి ఇంటికి పోతది. పాపం, దాన్ని జూస్తె ఎవరికైనా గుండెలు పిసికినట్టనిపిస్తది" అన్నాడతడు ఆ గౌరమ్మ అనే ఆమెవైపు చూస్తూ.

నేనతనికి థాంక్స్ చెప్పి గౌరమ్మ దగ్గరకు వెళ్ళాను.

ఆమెకు ముప్పయేళ్ళుంటాయనిపించింది. చూడటానికి కాస్తోకూస్తో అందమైన దానిలాగే, తెలివైనదానిలాగే కనిపించింది. ఛామనఛాయ, కోలమొఖం...

కనుముక్కు తీరు బాగున్నాయి. నొసలు మీద నల్లటి బొట్టు... దట్టమైన వెంద్రుకల్ని నిర్లక్ష్యంగా ముడివేసుకుంది. ఆమె యేడుస్తున్నట్టుగా కనిపించినప్పటికీ, యేడ్వటం కంటె ఎక్కువగా మాట్లాడుతున్నది. ఆమె ఎదుట తన భర్త ఉన్నట్టే భావించి అతనితో అదేపనిగా మాట్లాడుతున్నదని నాకర్థమైంది. తన బాధనంతా అతనితో చెప్పుకుంటున్నదనుకుంటే మనం పొరబడ్డట్టే... ఆమె చచ్చిపోయిన ఆమె భర్తను తిట్టిన తిట్టు తిట్టకుండా పరుషమైన పదజాలంతో తిట్టేయడం వింటోంటే నేను షాకయిపోయాను.

"ముదనష్టపోడ... నువ్వు బాగనే పోయినవు... నీదారి నువ్వు బాగనే చూసుకున్నవు... నువ్వు చచ్చుడుతోటి నీ కష్టాలన్ని తీరిపోయినయిగని మా కష్టాల సంగతేందిరా పాడు మొఖపోడ... నేను, నా పిల్లలు యేమైపోవాలనుకున్నవురా పాపాత్ముడ... నువ్వు జేసిన పని యాదికొస్తే నా కడుపు మసలిపోతాందిరా... నువ్వు కండ్లబడితే ఈ చెంపా ఆ చెంపా పగులగొట్టాలని ఉందిరా దరిద్రపోడ... మేనమామ బిడ్డనని, నన్ను తప్ప ఇంకోదాన్ని జేసుకోనని శనోలె మా నాయిన వెంటబడి నన్ను జేసుకుంటివి. నీ మొఖం జూడంగనే అనుకున్న,గీ తుమ్మమొద్దును జేసుకొని నేనేం సుఖపడ్తనని... అక్కకొడుకని, అమాయకుడని మా నాయిన నీమీద జాలిపడి నీకు నన్నిచ్చిండు... దేవుడు నాకు నిన్నే రాసిపెట్టిండనుకొని, మెడకు పడ్డ పాము కరువక మానదనుకొని నిన్ను జేసుకున్న... ఓ ఇల్లు, ఇంత భూమి ఉందనుకొని తృప్తిపడ్డ... మొదట్లో ఆ భూమిల అంతో ఇంతో పండేది... తిండిమందం యెళ్ళేది.... పెళ్ళైన మూడేళ్ళకే ఇద్దరు పిల్లల్ని కంటిమి... కనంగానే యేమాయె... వాళ్ళను పెంచి పెద్ద చెయ్యొద్దా? చదువు చెప్పియ్యొద్దా? గా కొత్తగొచ్చిన కాటన్ నాశనమైపోను... దాని జోలికి పోవద్దని నేనెంత మొత్తుకున్నా విన్నవా? గా పంటకు బోల్డు పెట్టుబడి గావాలె... అది మనతోటి కాదంటే యిన్నవా? పంట పండకపాయె... పండినప్పుడు ధరలు పడిపాయె... దెబ్బమీద దెబ్బ... అప్పులు పెరిగిపాయె... అప్పులోల్లొచ్చి ఇజ్జత్‌దీసిరి... గిదంత జూసి పురుగుల మందుతాగి చస్తివి... నువ్వు చస్తే మేమేం గావాల్ననుకున్నవురా యెడ్డిమొకపోడ, గిప్పుడు నువ్వు నాకంటికి కనబడ్తే నరికి పోగులు బెడ్తును... బుద్ధిలేనోడ... ముందుచూపు లేని గుడ్డోడ... నీకంటె ఓ కళ్ళులేని కబోది నయం..."

ఆమె అలా చనిపోయిన తన భర్తను తన ముందున్నట్టుగానే భావిస్తూ తిడ్తూనే ఆమె పక్కనే నిల్చున్న నాకేసి చూసింది.

"ఎవరు నువ్వు? గిక్కడెందుకున్నవు? గవర్నమెంటోనివా? నాకేమన్న ఇస్తననొచ్చినవా?" అందామె నాకేసి చురచురా చూస్తూ.

"నేను గవర్నమెంటోణ్ణికాను గని చచ్చిపోయిన మనిషిని పట్టుకొని అతడు నీముందు బతికున్నడు అన్నట్టుగా నోటికొచ్చినట్టల్లా తిడ్తున్న నిన్ను చూస్తోంటే చాలా ఆశ్చర్యం కల్గుతోంది" అన్నాను శాంతంగానే.

"నాఇష్టం. నేను గట్లనే తిట్టుకుంట... నీకొచ్చిన కష్టమేంది? నీకెందుకు ఆశ్చర్యం కల్గాలె... అసలు నువ్వెవరు? నేను నా కడుపుమంట చల్లారేదాక మావోన్ని గిట్ల తిడ్తనే ఉంట... వద్దనటానికి నువ్వెవరు?" అందామె కోపంగా నాకేసి చూస్తూ.

"నేనో జర్నలిస్టునమ్మా" అన్నాను.

"జర్నలిస్టువా? పేపర్లల్ల రాస్తరు... జర్నలిస్టులంటే గవాళ్ళేగద" అందామె ఈసారి నాకేసి కొంచెం ఆశ్చర్యంగా చూస్తూ.

"అవును" అన్నాను.

"ఇప్పుడు నేను మావోణ్ణి తిట్టిన తిట్లన్నీ పత్రికల రాస్తవాయేంది?"

"రాస్తే రాస్తగని నీభర్త చచ్చిపోయిండుగద... చచ్చిపోయినోణ్ణి తిడ్తే యేమొస్తది..."

"యేమొస్తదా? గిప్పుడే చెప్తినిగద... నా కడుపుమంట చల్లార్తది. మమ్మల్ని నట్టేట్లో ముంచిపోయిన వాన్ని ఎంత తిడ్తే నాకసి అంత చల్లార్తది. వాన్నింకా తిడ్త.. గియ్యన్ని నువ్వు రాయి... ఓ భార్య ఓ భర్తను ఎన్ని తిట్లు తిట్టిందో రాయి... వానింట్ల పీనిగెల్ల... వాని తలపండు పగుల... వాని తాడుదెంప... వాని మొఖం మొద్దుల్లపెట్ట... వాని పెండ్లం చేతుల బెల్లంబెట్ట... వాన్ని ప్రాణంతోటె బొందబెట్ట... గిట్ల తిట్టిన్నని రాయి"

"నువ్వు పెడ్తున్న ఈ శాపనార్థాలన్ని నిజమైపోయినయిగద... ఆ శాపనార్థాలు పెట్టి ఇప్పుడిక యేం ప్రయోజనం?"

"నాకడుపు మసలిపోతాంది... ఎంత తిట్టినా నాకసి తీర్తలేదు. యేం జెయ్యమంటవు?" అంటూనే ఆమె ఆ సమాధి ముందు కుప్పగా కూలిపోయి భోరుమని యేడ్చింది. ఆమెను కాస్సేపు అలా యేడవనిచ్చి

"ఊరుకో గౌరమ్మా! ఊరుకో..." అన్నాను.

ఆమె ఆశ్చర్యంగా తలెత్తి నాకేసి చూసింది.

'నాపేరు నీకెట్ల తెలిసె?"

"మేం జర్నలిస్టులం... అన్నీ తెలుసుకుంటాం... నీభర్తపేరు సత్తెయ్యా... ఔనా?"

"ఔను... సత్తిగాడు... వాన్నందరు సత్తిగాడంటరు... నేనింత వరకు వాన్ని సత్తిగాడనలేదు. కానీ ఇప్పుడంట... వాడు సత్తిగాడు... సత్తెకాలపోడు... యెడ్డిమొఖపోడు... చచ్చినోడు... మమ్మల్ని చంపుతున్నోడు"

"సత్తెయ్య ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులేమిటో చెబుతావా?"

"మాగ చెబుతగని చెప్తే యేంజేస్తవు? నేను చెప్పిందంత పత్రికల రాస్తవా? నాకెమన్న ఇప్పిస్తవా"

"రాస్తాను... రాస్తే నీకేమన్న అభ్యంతరమా?"

"అభ్యంతరమేం లేదు... రాయాలె... అది చదివినోళ్ళందరికి బుద్ధిరావాలె... ఆత్మహత్యలు జేసుకున్నోళ్ళు పైలోకానికి బొయి బాగనే ఉంటరు... కని ఈ లోకంల ఉన్నోళ్ళ గతేం కావాల్నో వాళ్ళు ఆలోచించిండ్రా? వాళ్ళ గుండెలెట్ల పగిలిపోతయో... బతికున్నంతకాలం వాళ్ళు చచ్చినోళ్ళతోటి సమానంగ ఎట్ల జీవచ్ఛావాలుగ బతుకుతరో వాళ్ళకెరికేనా? మా సత్తిగాడెందుకు చచ్చిండో... ఎట్ల చచ్చిండో నీకు చెప్త... నువ్వు జర్నలిస్టునంటున్నవు గద... నేను చెప్పిందంత రాస్తే ఇంకోడు ఆత్మహత్యజేసుకోవద్దు..."

"అట్లాగే... మీ సత్తెయ్య ఎందుకు ఆత్మహత్య చేసుకున్నడో చెప్పుమరి..." అన్నాను.

"మల్ల సత్తెయ్యంటవు... నువ్వు కూడ వాన్ని సత్తిగాడే అనాలి... వాడో డర్టీ ఫెల్లో... వాడో ఇడియట్..."

"ఇంగ్లిష మాటలు బాగనే మాట్లాడుతున్నవు... నువ్వేం చదువుకున్నవు"

"ఎస్.ఎస్.సి. పాసైన... యేం లాభం... ఎస్.ఎస్.సీ ఫేలయిన మొద్దును జేసుకున్న... ఇంకా చదువుతననే అన్న. మా నాయిన ఆడదానివి, నీకు చదువెందుకే అని గీ తుమ్మమొద్దుకిచ్చి పెండ్లిజేసిండు" అందామె ఆ సమాధినే మనిషన్నట్టుగా చూపిస్తూ.

"పెండ్లి గాకముందు నేను సుఖంగనే బతికిన... మా ఊర్లె హైస్కూలుంది. రోజూ నా ఫ్రెండ్స్‌తో కలిసి స్కూలుకెళ్ళే దాన్ని... స్కూలు వదిలినంక బోల్డు ఆటలు ఆడుకునేటోళ్ళం. సెలవులొచ్చినప్పుడు మా చెలకాడికి పోయేటోళ్ళం... మాకు మంచి మామిడితోటుండేది... ఆ తోటలో ఉయ్యాల కట్టుకొని ఉయ్యాలూగేటోళ్ళం... కోతికొమ్మంచి ఆట ఆడేటోళ్ళం. తొక్కుడుబిళ్ళ ఆట ఆడేటోళ్ళం... బొమ్మల పెళ్ళిళ్లు చేసేటోళ్ళం... ఊళ్ళకొచ్చి పచ్చీసు... గచ్చకాయలు ఆడేటోళ్ళం... ఆ రోజులెంత హాయిగా గడిచిపోయేవో గుర్తొస్తే మళ్ళీ ఆ రోజులొస్తే ఎంత బావుండును అనిపిస్తుంది.

ఇట్ల ఆటపాటలతోటే టెన్త్‌దాక చదివినం... పరీక్షల దగ్గర పడ్డప్పుడు రాత్రనక పగలనక చదివేటోళ్ళం.... నేనూ, నా ఫ్రెండ్స్ పరీక్షలు బాగ రాసినం.... ఫస్ట్‌క్లాసుల ప్యాసయినం. మా ఊరికి దగ్గర్లోనే ఉన్న వరంగల్‌కు బొయి ఇంటర్మీడియేట్ చదువుతనంటే మా నాయన ఒప్పుకోక గీ దరిద్రపోనికిచ్చి పెండ్లి జేసిండు. పెండ్లయినప్పట్నించే నా కష్టాలు షురువైనయి" అంటూనే ఆమె మళ్ళీ కాస్సేపు నిశ్శబ్దంగా కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

త్వరలోనే తేరుకొని ఆమె మళ్ళీ చెప్పడం మొదలెట్టింది.

"పెండ్లయినంక అన్నీ కష్టాలే... మా పెండ్లయిన ఆరునెల్లకే మా మామ చచ్చిపోయిండు. ఆయన ఉన్నంత సేపు వ్యవసాయం పనులు ఆయనే చూసుకునేటోడు... మా సత్తిగాడు తండ్రి యే పనిచెప్తే ఆ పని చేసెటోడు. మాకు ఐదెకరాల భూముంది. ఆ భూమిలో మా మామ వరో, పెసల్లో, మిర్చో, వేరుశనగలో పండించెటోడు. బాగనే గిట్టుబాటయ్యేది. మా మామ చచ్చిపోయిన ఇంకో యేడాదికి మా అత్త కూడ చచ్చిపోయింది. కోడలొచ్చి అత్తమామల్ని సాగనంపిందని మా ఊరోళ్ళందరు నామీద యేడ్చింద్రు. మా మామేమో హార్ట్ ఎటాక్‌తోటి చచ్చిండు. అత్తేమో కాన్సర్‌తోటి చచ్చింది. దీంట్లె నేను చేసిందేముందని నాకు నేను చెప్పుకొని అమ్మలక్కల మాటల్ని పట్టించుకోలేదు. తండ్రి, తల్లి ఇద్దరు చచ్చిపోవుడుతోటి ఇంటి పెత్తనమంతా మా సత్తిగాని చేతికొచ్చింది.

"మా నాయనకు వ్యవసాయమే చెయ్యరాకపోయేది. నేను కొత్త పద్ధతులల్ల వ్యవసాయం చేసి బంగారం పండిస్తనని హెచ్చులు కొట్టుడు షురూ జేసిండు. ఊర్లె ఎవరో కొత్తరకం కాటన్ పండిస్తే మంచి లాభాలొస్తయని, నేను సుత గా కాటన్ పెడ్తున్న... నువ్వు కూడ పెట్టు అని చెప్పిండట... ఆ చెప్పినోడు బాగ ఉన్నోడు... వానికి ఇరవై ఎకరాల భూముంది... నీటి వసతులున్నయి. ఎంత పెట్టుబడైనా పెట్టే శక్తుంది. పులిని జూసి నక్క వాతపెట్టుకున్నట్టు నువ్వెందుకు గా కాటన్ జోలికి పోతవని నేను మొత్తుకున్న. నామాట విన్లేదు. కాటన్ పండిస్తే బోల్డు లాభముంటుందని రేడియోల చెప్పింద్రు. మీ పేపర్లల్ల రాసింద్రు... దాంతోటి మా ఊర్లె మా సత్తిగానితోబాటు ఇంకా కొందరు వరంగల్లుకు బొయి కాటన్ విత్తనాలు దెచ్చింద్రు.

గా కాటన్ పండించుటంటే మాటలా నాయినా? ఎన్ని జాగ్రత్తలు తీసుకోవాల్నో, ఎన్ని మందులు వాడాల్నో, ఎన్ని ఎరువులు గుప్పించాల్నో... ఇదంతా జరగాల్నంటే ఎంత పెట్టుబడి పెట్టాలో నీకెరికేనా జర్నలిస్టూ?" అందామె.

"నాకు కొంచెం తెలుసు. కానీ అనుభవించినదానివి... నువ్వు చెప్తేనే బావుంటుంది" అన్నాను.

"కొత్త పత్తి విత్తనాలకు రోగనిరోధకశక్తి బాగుంటదని, దిగుబడి కూడా బావుంటుందని చెప్పింఁడ్రు. గా కాటన్ పండించే వాళ్ళకు, బ్యాంకు రుణాలు కూడా ఇస్తరన్నరు. మావోడు కూడ బ్యాంకు రుణం తీసుకున్నడు. కొత్త విత్తనాలు తెచ్చిండు.

ఈ విత్తనాల్ని జూన్‌లోగా విత్తుకోవాలని చెప్పింఁడ్రు. గీ విత్తనాలు నాటుకునే ముందు భూముల్ని ఎలా తయారు చేసుకోవాలో కూడా వ్యవసాయ శాఖోళ్ళు మాగ చెప్పింఁడ్రు. ఆ భూముల్లో పశువుల ఎరువులు... ముఖ్యంగా గొఁరెమందల ఎరువులు, కోళ్ళ ఎరువులు పెట్టించుకోవాలె. తర్వాత డి.ఏ.పి. 28-28, యూరియా, కాల్షియం నైట్రేట్, అమ్మోనియా సల్ఫేట్, మొరేట్ ఆఫ్ పోటాష్, జింక్ సల్ఫేట్ లాంటి రసాయన ఎరువులు వేసుకోవాలె.

భూమిని ట్రాక్టర్‌తోగానీ, డిస్కులతో గానీ లోతుగా దున్నించాలె. అదీ జూన్‌లోగా. తర్వాత కల్టివేటర్‌తో దున్నించి గుంటుకలతో చదును చేయించి అచ్చుమళ్ళలో రెండు వైపులా 3 నుండి 4 అడుగుల ఎడంతో అచ్చు తొలిగించుకొని ఓ వర్షం పడ్డాక తడి ఆరకముందే ఆయా మూలలలో విత్తనాల్ని ఒక అంగుళం లోతులో నాటించాలి. అసలైన విత్తనాలైతే నాల్గైదు రోజుల్లో బలంగా మొలకెత్తుతయి. అసలైన విత్తనాలని ఎందుకంటున్ననంటే కొన్నిసార్లు నకిలీ విత్తనాలొస్తయి. అప్పుడు వేసిన విత్తనాలన్నీ మొలకెత్తవు. కొన్నే మొలకెత్తుతయి. నకిలీ విత్తనాల సంగతి తర్వాత చెప్త. మంచి విత్తనాలు మొలకెత్తి మూరాకు వేశాక మొలక గుంటుకల్ని మొక్కల మధ్య స్థలంలో తోలుకోవాలె.

పత్తి మొలక కనిపించినప్పట్నించి వాటిని ముడత పురుగుల నుండి, పేనుబంక పురుగుల నుండి కాపాడుకోవాలె. అందుకు క్రిమిసంహారక మందుల్ని స్ప్రే చెయ్యాలె. ఆనాటి నుండి కాయలు కాచి పత్తిగా మారేవరకు వివిధ దశల్లో అవసరానుసారం మందులు వాడటం, ఎరువులు వేయడం, కలుపు తీయడం, గుంటకలు తోలటం జరుగుతూనే ఉండాలె.

పత్తిలో ముఖ్యమైన గమనిక ఏంటంటే పురుగుబారిన పడ్డాక మందు కొట్టవచ్చులే అని ఏమరుపాటు వహిస్తే కొద్దిరోజుల్లో పురుగు - ఎన్నోరెట్లు పెరిగిపోయి పంటంతా నాశనమౌతది.

ఎంత జాగ్రత్త వహించినా సమయానికి మనం కొట్టే మందు మోతాదులో లోపం జరిగినా, పంటకు అనువుకాని మందుతో కలిపి కొట్టినా, చవకబారు

కంపెనీవాళ్ళు తయారుచేసే మందు కొట్టినా, కల్తీ మందు కొట్టినా అవి యేమాత్రం పనిచెయ్యవు. డబ్బులూ ఖర్చవుతయి. ప్రయోజనం ఉండదు. ఒక్కసారి దెబ్బతిన్న పైరు మళ్ళీ కోలుకోవడానికి చాలా టైమ్ పడ్తది. కొన్నిసార్లు ఆ కోలుకోవడం కూడా జరక్కపోవచ్చు.

జూన్ 15 నుండి జూలై 15 వరకు విత్తుకొన్న పత్తి, అన్ని సరిగ్గా జరిగితే, నవంబర్‌లో మొదటి కాయపత్తిని ఏరుకోవచ్చు. అంటే నాల్గైదు నెలల్లో మార్కెట్‌లో అమ్ముకొని పెట్టుబడి పెట్టిన కొంత డబ్బును రాబట్టుకోవచ్చు. నీటివనరు బాగా ఉన్నా, వర్షాలు అనుకూలంగా కురిసినా నవంబర్ నుండి మార్చ్ వరక్కూడా పత్తిని పండించుకోవచ్చు. బాగా పండినట్టయితే ఎకరాకు 15 నుండి 20 క్వింటాళ్ళ వరకు దిగుబడి ఉంటుంది. రేటు కూడా బావుంటే ఎకరాకు 30 నుండి 50 వేలు గిట్టుబాటు కావొచ్చు. ఖర్చులు పోగా 20 వేలైనా మిగులుతయి.

ఇంత లాభం ఉంటుంది కాబట్టి చాలామంది రైతులు కొత్తరకం కాటన్ వైపు ఆకర్షితులయ్యింద్రు.

పత్తి పంటకు పట్టే పురుగులు 70లలో కంటె 80లలో, తర్వాత 90లలో ఎక్కువగా అభివృద్ధి చెందినయి. యే మందుకూ లొంగని దశకు చేరుకున్నయి. అప్పుడు సైపర్ మెత్రీన్, ట్రైసర్, అవాంట్ లాంటి చాలా ఖరీదైన పురుగు మందులు... ఒక్కొక్కసారి ఎకరానికి 1000 నుండి 1500 వరకు ఖర్చు పెట్టాల్సి వస్తది. ఒక్కసారికే కంట్రోలయితే ఫరవాలేదు. ఒక్కోసారి మరీమరీ ఈ మందులు కొట్టాల్సి వస్తది. ఇలా పెట్టుబడి విపరీతంగా పెరగటం వల్ల వడ్డీకి తెచ్చిన అప్పులు పెరిగిపోతుండటం, ఈసారైనా బాగా పండకపోతుందా అన్న ఆశతో ఒకసారి నష్టపోయినా మరో సంవత్సరం అదే పంటను వేయటం, పెట్టుబడికోసం మళ్ళీ అప్పులు చెయ్యడం, పైరును కాపాడుకునే ప్రయత్నం చెయ్యడం, ఎక్కడో యేదో పొరపాటు జరిగి మళ్ళీ పంట దెబ్బతినటం – దాంతో రైతుకు కోలుకోలేని పరిస్థితి యేర్పడటం – బతుకు అతలాకుతలం అయిపోవడం, కొందరు రైతులు గుడుంబా లాంటి మత్తు మందులకు అలవాటు పడిపోవటం – దిక్కుతోచని పరిస్థితిలో – బ్యాంకువాళ్ళొచ్చి అప్పులు చెల్లించమని వొత్తిడి చెయ్యడం, ఈ అవమానం భరించలేక మరణమే శరణ్యం అనుకోవడం, ఆత్మహత్యలకు పాలుపడటం జరుగుతది.

మావోనితో గీ కాటన్ పండించటంలో ఇన్ని సమస్యలున్నయి... దాని జోలికి పోవద్దన్న. కానీ వాడు నామాట విన్లే.

మొదటిసారి కాటన్ వేసినప్పుడు అన్ని జాగ్రత్తలు తీసుకున్నం. భూమిని చదును చెయ్యడం, ఎరువులు వేయటం, విత్తనాలు నాటటం, క్రిమిసంహారక మందులు సకాలంలో వాడటం – ఈ పనులన్నీ ఇద్దరం కలిసి చాలా పట్టుదలగా చేసినం. ఆ సంవత్సరం 20 వేల బ్యాంకు రుణం కూడా దొరికింది. అన్ని చక్కగా కుదిరినయి. ఎకరాకు 15 క్వింటాళ్ళ దిగుబడొచ్చింది. ధర కూడా గిట్టుబాటయ్యింది. ఖర్చులు పోగా 30 వేల వరకు మిగిలినయి. వ్యవసాయంలో ఇదివరకు మాకెప్పుడూ ఇంత లాభం రాలేదు. బ్యాంకు అప్పు తీర్చేసినం. ఇంకో పదివేలు చేతికొచ్చినయి. దాంతో మా వాడికి పట్టపగ్గాలు లేకపొయినయి. పెద్దగుర్రం ఎక్కిన్ననుకున్నడు.

మాకిద్దరు పిల్లలు... ఓ పాప, బాబు... పత్తిపంట మీద ఇంత లాభం రావడంతో వాళ్ళిద్దర్నీ మా ఊరికి దగ్గర్లోనే ఉన్న ఇంగ్లీషు మీడియం స్కూలుకు తీసికెళ్ళి జాయిన్ చేయించినం. డొనేషన్లనీ, అడ్మిషన్ ఫీజులనీ, పుస్తకాలకనీ ఆ ప్రైవేట్ స్కూలోడు మా దగ్గర్నించి బోల్డు డబ్బు వసూలు చేసిండు. మా బాబును ఐదో తరగతిలో, పాపనేమో మూడో తరగతిలో చేర్పించినం. చెరి పదివేలు చెల్లించి వాళ్ళను ఆ స్కూలు వాళ్ళు పెట్టిన హాస్టళ్ళోనే ఉంచినం. దాంతో మా ఖర్చులు విపరీతంగా పెరిగిపోయినయి. అప్పులు పెరిగిపోయినయి. మళ్ళీ పత్తి పండించి ఆ అప్పులన్నీ తీర్చేస్తానని మావోడు నాకు ధైర్యం చెప్పిండు.

మొదటిసారి రెండకరాల్లోనే కాటన్ వేసినం. రెండోసారి నాల్గు ఎకరాల్లో వేద్దామని నిర్ణయించిండు. అంత పెట్టుబడి ఎక్కణ్ణించి తెస్తవని నేనెంత మొత్తుకున్నాఆయన విన్లేదు.

నాల్గు ఎకరాల భూమిని పత్తిని వేయడానికి అనుగుణంగా మార్చటానికి బోల్డు ఖర్చయింది. తర్వాత విత్తనాలకు, రసాయనిక ఎరువులకు, క్రిమిసంహారక మందులకు వేనకువేలు ఖర్చయినయి. మళ్ళీ బ్యాంకులోన్ – ఈసారి 50 వేలు తీసుకున్నం. అది యే మూలకు సరిపోలే. మా ఊరి షావుకారి దగ్గర రెండు పైసల వడ్డీకి ఇంకో 20 వేలు తీసుకున్నం. ఇట్లా ఎన్నో అప్పులు చేసి, ఎన్నో కష్టాలు పడి అన్ని జాగ్రత్తలు తీసుకున్నాక నాల్గెకరాల్లో వేసిన పత్తిపంట చేతికొచ్చింది. ఈసారి కూడా దిగుబడి బాగనే వచ్చింది. ఎకరానికి 16 క్వింటాళ్ళు పండింది. ధరమాత్రం అనుకున్నంత గిట్టుబాటు కాలేదు. అయినప్పటికీ ఖర్చులన్నీ పోను ఓ ముప్పై వేల వరకు మిగిలినయి. కొన్ని అప్పులు తీర్చినం. పిల్లల చదువుల కోసం మళ్ళీ ఓ పదివేలదాకా ఖర్చు పెట్టాల్సి వచ్చింది.

ఈసారి మాకున్న మొత్తం ఐదెకరాల్లో కాటన్ వేద్దామన్నడు. ఒక సంవత్సరం ఇంకేదైనా పంట పండించి ఆ తర్వాతి సంవత్సరం కాటన్ వేసుకుంటే మంచి గిట్టుబాటుంటుందని రేడియోలో వచ్చే వ్యవసాయ కార్యక్రమాల్లో చెప్పగా విన్న. ఈమాటే ఆయన చెవిలో వేసిన. వాళ్ళు అట్లనే చెబుతరని కొట్టిపారేసిండు. యే పంట వేసినా కాటనోలె గిట్టుబాటు కాదన్నడు. మాలాంటి కొందరు రైతులకు కాటన్ మీద మంచి లాభాలు రావడంతో మా ఊర్లోని రైతులంతా కాటన్ పండించటం మొదలెట్టింద్రు. రైతులంతా సిటీకి బొయి విత్తనాలు కొనుగోలు చెయ్యటం, రసాయన ఎరువులు కొనుగోలు చెయ్యటం, క్రిమిసంహారక మందులు కొనుగోలు చెయ్యటం మొదలెట్టింద్రు. దాంతో వీటిని అమ్మే వ్యాపారస్తులు కల్తీ విత్తనాలు, కల్తీ మందులు అమ్మడం షురూజేసింద్రు.

కొన్ని షాపులోళ్ళు పురుగుమందుల్ని, విత్తనాల్ని, రసాయన ఎరువుల్ని ఉద్దెరకిచ్చెటోళ్ళు. ఉద్దెరంటే ఎరికేనా? సరుకులు ఇప్పుడిస్తరు. ఎంతయ్యిందో వాళ్ళ ఖాతా పుస్తకాలల్ల రాసుకొని డబ్బులు తర్వాతియ్యమంటరు. ఉద్దెరకిస్తరంటే మావోడు వెనుక ముందు చూడక అడ్డగోలుగ వాళ్ళు యేదిస్తే అది తెచ్చెటోడు. అవి నకిలీ విత్తనాలా... నకిలీ మందులా... ఇవేవీ చూడకపోయేది. పైసలిప్పుడిచ్చేది లేదుగదా అని అవసరమున్నా లేకపోయినా వేలకొద్ది రూపాయల మందులు, ఎరువులు, విత్తనాలు తెచ్చెటోడు. అవన్నీ తడిచి ముప్పందుం అయ్యేవి. వడ్డీతో సహా ఆ పైసలు కట్టమని ఆ షాపువాడొచ్చినప్పుడు తెల్లమొఖం పెట్టెటోడు. ఈ ఉద్దెరకు తెచ్చిన సరుకులు కొన్నిసార్లు నకిలీవని తెలిసినా యేం చెయ్యలేకపోయెటోళ్ళం.

కొన్నిసార్లు లోవోల్టేజి కరెంట్ వల్ల కూడా మేం నష్టపోయినం. లోవోల్టేజి వల్ల కరెంట్ మోటర్లు కాలిపోయేటివి. వాటిని బాగు చేయించటానికి మూడు నాల్గు రోజులు పట్టేది. ఆ మూడు నాల్గు రోజులు నీళ్ళు పెట్టకపోవడం వల్ల పత్తిచేను ఎండిపోయేది. పంట దిగుబడి పడిపోయేది. ఇట్ల లోవోల్టేజి కొన్నిసార్లు మమ్మల్ని నిండా ముంచేది.

అట్లా ఒకసారి మేం వేసిన విత్తనాలే సరిగ్గా మొలవలేదు. మొలిచిన విత్తనాలు కూడా చాలా బలహీనంగా మొలిచినయి. ఎన్ని మందులు కొట్టినా అవి బాగుపడలేదు. బోల్డు పెట్టుబడి పెట్టినం. అంతా బూడిదలో పోసిన పన్నీరే అయిపోయింది. ఎకరాకు ఐదారు క్వింటాళ్ళ దిగుబడి కూడా రాలేదు. దాంతో విపరీతమైన నష్టం... మాకు గుండె పగిలినంత పనయిపోయింది. మావోడు దెబ్బతిన్న పత్తిచేనును చూసి గుండెలు

బాదుకున్నడు. ఆ పత్తిచేన్లోనే పెస్టిసైడ్ మందు తాగి చచ్చిపోతానన్నడు. నేనే వానికి ధైర్యం చెప్పి ఇంటికి తీసుకొచ్చిన. గప్పుడే మా ఊర్లో ఓ పత్తిరైతు ఆత్మహత్య చేసుకున్నడు.

ఈసారి చేసిన అప్పులన్నీ అలాగే ఉండిపోయినయి. వడ్డీ పెరిగిపోసాగింది. మావోడు ఈమధ్యలో తాగుడుకు అలవాటు పడ్డడు. ఎందుకట్ల పిచ్చోనోలె గుడుంబ తాగుతున్నవంటె బాధను మరిచిపోయేటందుకన్నడు

ఈసారి మళ్ళీ కాటనే పెడ్తానన్నడు. ఈసారి అప్పు పుట్టే అవకాశం కనిపించలేదు. మావోనికి నాకున్న కొద్దిపాటి నగల మీదికి దృష్టి మళ్ళింది. వాటిని అమ్మేసి పెట్టుబడి పెడదామన్నడు. కాలం కలిసొస్తే మళ్ళీ నీకా నగలు చేయించి పెడ్తానన్నడు. నువ్వు మళ్ళీ చేయించటం అబద్ధం అన్న. ఈసారి ఎకరాకు 20 క్వింటాళ్ళు పండిస్తనన్నడు. 50 వేలన్న మిగుల్తయన్నడు. కొన్ని అప్పులు తీర్చేసి నీకోసం కొంత బంగారం కొంటనన్నడు. "మనమసలు కాటన్ జోలికే వెళ్ళకుండా ఇంకేదన్న పంట పండిద్దామని నేనన్న. ఇద్దరం చాలాసేపు తీవ్రంగా వాదించుకున్నం. నేను నువ్వెంత యేడ్చి మొత్తుకున్న నా నగలు ఇవ్వనన్న. నాకున్నది ఓ పుస్తెలతాడు, నల్లపూసల గొలుసు, చెవుల దిద్దులు, ఓ నాల్గు తులాల చంద్రహారం – గివ్వే నా నగలు – గీమాత్రమైనా లేకపోతే పెళ్ళిళ్ళకు, పేరంటాలకు ఎట్ల పోను... మా చుట్టాల ముందు ఎట్ల తలెత్తుకొని తిరగను? మా ఆడవాళ్ళెప్పుడూ "ఈమె యేం చీరకట్టుకున్నది... యేం నగలు పెట్టుకున్నదనే చూస్తరు...

నేను నగలివ్వననేసరికి మావోడు మొదలు బతిమాలిండు. తర్వాత అరిచిండు... తర్వాత నామీద చెయ్యి చేసుకున్నడు... తర్వాత చస్తనని బెదిరించిండు. అయినా సరె నేను నా నగలిచ్చేది లేదు అన్న. ఈసారి చాలా తక్కువ పెట్టుబడితో యే వేరుశనగ చేనో, యే వరిచేనో వేద్దామన్న. వాడు విన్లేదు... ఇంట్లోంచి వెళ్ళిపోయి ఆరాత్రి ఫుల్లుగ తాగొచ్చిండు. తాగిన మైకంలో పిచ్చిపిచ్చిగా అరిచిండు. నన్ను తిట్టరాని తిట్లు తిట్టిండు. వాడు తిట్టిన ఆ బూతు తిట్లు, గలీజు తిట్లు వింటున్నప్పుడు నాకు చచ్చిపో బుద్ధయింది.

అమర్నాడు వాడు నగలివ్వకపోతే ఉరేసుకొని చచ్చిపోతనని నిజంగనే ఉరేసుకోబోయిండు.

నా నగలు తీసి వాడి మొహాన కొట్టిన. వాటిని 50 వేలకు అమ్ముకొచ్చి మళ్ళీ ఐదెకరాల్లో కాటన్ వేసిండు.

ఈసారింకా ఘోరం జరిగింది. ఎంతో కష్టపడి భూమిని చదునుచేసినం. సహజ ఎరువులు, రసాయన ఎరువులు అన్నీ వేయించినం... వర్షాలు కూడా సకాలంలో కురిసినయి. అయితే విత్తనాల దగ్గర, క్రిమిసంహారక మందుల దగ్గర మోసపోయినం. విత్తనాలమ్మే వ్యాపారస్తులు నకిలీ విత్తనాలు సప్లై చేసింద్రు. మందులమ్మేవాళ్ళు కూడా నకిలీ మందులే సప్లై చేసింద్రు. సగం విత్తనాలు మొలవనే లేదు. మొలిచిన విత్తనాలకు రోగం తగిలింది. ఎన్ని మందులు కొట్టినా ఫలితం లేకపోయింది. ఈసారింకా దెబ్బతిన్నం. 50 వేల పెట్టుబడికి పదివేల పంట కూడా రాలేదు. మావోడు లబోదిబోమని మొత్తుకున్నడు. ఉద్దెరకిస్తాంద్రని మావోడు వెనుక ముందు చూడకుండా ఎవడిస్తే వాని దగ్గర విత్తనాలు, ఎరువులు, మందులు తెచ్చినందుకే ఇట్ల జరిగిందనుకున్నం.

ఈ ఊర్లో ఈసారి ఇంకో ఇద్దరు పత్తిరైతులు ఆత్మహత్యలు చేసుకున్నరు. ప్రభుత్వం వారు వాళ్ళ కుటుంబాలకు రెండు లక్షల ఎక్స్‌గ్రేసియాను ప్రకటించింద్రు. వాళ్ళు చేసిన అప్పులన్నీ మాఫీ చేస్తమన్నరు.

ఇది తెలిసినప్పట్నించి మావోడు కూడా నేను కూడా ఆత్మహత్య చేసుకుంటే నువ్వు, పిల్లలూ బాగుపడ్తరు... మన అప్పులన్నీ తీర్తయి అని వాగటం షురూ జేసిండు.

అలాంటి పిచ్చిపిచ్చి ఆలోచనలు మానుకో అని నెత్తీనోరు బాదుకొని చెప్పిన.

"నీ నగలు కూడా కాజేస్తిని... నీకు మళ్ళీ ఆ నగలు చేయిస్తనని ప్రమాణం చేసిన... నామాట నిలుపుకోలేకపోతిని. ఇక నేనెందుకు బతకటం" అన్నడు.

"నా నగల గురించి ఆలోచించకు... కాలం కలిసొచ్చినప్పుడు అవే వస్తయి... మన పిల్లల చదువులను గురించి ఆలోచించు" అన్న.

"మన పిల్లల చదువులు మాత్రం ఎట్ల సాగుతయి" అన్నడు.

"ఓ ఎకరం భూమి అమ్ముదామ"న్న.

వాడు మొదలు ఒప్పుకోలేదు.

కానీ ఓ రాత్రంతా ఇద్దరం కూర్చొని ఎన్ని అప్పులున్నయో తేల్చుకున్నం. పిల్లల చదువులు కొనసాగాల్నంటే ఎన్ని డబ్బులు కావాలో లెక్కవేసినం. భూమి అమ్మక తప్పదన్న నిర్ణయానికొచ్చినం.

ఎకరం భూమి అమ్మితే ఓ లక్షరూపాయలొచ్చినయి. కొన్ని నెత్తిమీదున్న అప్పులు తీర్చినం. పిల్లలు చదువుతున్న స్కూళ్ళో రెండు సంవత్సరాలుగా చెల్లించని ఫీజులన్ని చెల్లించినం... బ్యాంకు అప్పు మాత్రం అట్లనే ఉండిపోయింది.

ఇవన్ని పోగా మిగిలిన కొద్ది డబ్బుతో ఈసారి రెండకరాల్లో మాత్రమే కాటన్ వేసినం. ఈసారి పంట కాస్త బాగనే వచ్చింది. బ్యాంకు వాళ్ళొచ్చి వాళ్ళ అప్పు తీర్చమని, లేకపోతే మా ఇంటిని, భూమిని జప్తు చేస్తమని నోటీసు ఇచ్చిండ్రు. ఈసారి పత్తి ధర ఘోరంగా పడిపోవడం వల్ల మేం పండించిన పంటను అమ్మటం వల్ల పెట్టిన ఖర్చుమందమే వచ్చింది తప్ప యేమీ మిగల్లేదు.

అప్పుల వాళ్ళొచ్చి నెత్తిమీద కూర్చున్నరు. ఫీజులు కట్టలేదని మా పిల్లల అడ్మిషన్లు కాన్సెల్ చేసి ఇంటికి పంపించింద్రు. ఇదంత చూసి మావోడు విపరీతంగా తాగుడుకు అలవాటైపోయిండు.

ఉన్న భూమి మొత్తం అమ్మేసి, సిటీకెళ్ళి యేదన్న చిన్న బిజినెస్ చేద్దామని నేనో సలహా ఇచ్చిన. సిటీలో మా అన్నయ్య ఆటోలు అద్దెకిచ్చే వ్యాపారం చేస్తున్నడు. నీకూ ఓ ఆటో ఇస్తడు. నువ్వు ఆటోడ్రైవర్‌గా పనిచెయ్యి. నేనూ యేదన్న పని చూసుకుంటా. ఎట్లనన్న బతకొచ్చు అన్న. ఇంత బతుకు బతికి ఆటోడ్రైవర్‌గా పనిచేస్తనా? అంతకంటె ఉరిపెట్టుకొని చావడం నయం అన్నడు. నువ్వు చస్తే మేం ఏమయిపోవాలని ఎన్నో విధాల సమఝాయించిన. చద్దామనే ఐడియాను నీ బుర్రలోంచి తీసెయ్యమని బతిమాలిన. బతికుంటే బలుసాకు తినైనా బతకొచ్చు అన్న. కాలం ఎప్పుడూ ఇట్లనే ఉండదు. మనకూ మంచి రోజులొస్తయన్న. నేను చెప్పిందంతా విని "సరేలేవే... నేనేం చావనులే. చావటానిక్కూడా ధైర్యం కావాలె. అంత ధైర్యం నాకెక్కడుందిలేవే" అన్నడు.

అప్పట్నించి అతగాన్లో కొంచెం మార్పొచ్చినట్టే కనిపించింది. తాగడం తగ్గించుకున్నడు. నువ్వు చెప్పినట్టే వింటనన్నడు.

ఇల్లు కుదవబెట్టి మళ్ళీ కొంత అప్పుచేసి పిల్లల్ని స్కూలుకు పంపించినం. కొంచెం పెట్టుబడి పెట్టి మల్ల కాటన్ వేసినం. ఈసారింకా అధ్వాన్నం... నకిలీ విత్తనాలు, నకిలీ మందులు ఘోరంగా దెబ్బతీసినయి. రైతులందరు కలిసి విత్తనాలమ్మే షాపుల ముందు ధర్నాలు చేసింద్రు. వ్యవసాయాధికారుల ఆఫీసుకు ఊరేగింపు తీసింద్రు... టీవీల వాళ్ళు, పత్రికల వాళ్ళు రైతులకు న్యాయం జరిగేలా చూస్తమని, నకిలీ విత్తనాలు అమ్ముతున్న వ్యాపారస్తులను కఠినంగా శిక్షించేలా చూస్తమని వాగ్దానాలు చేసింద్రు. ధర్నాల్లో పాల్గొని సిటీ నుండి తిరిగొచ్చిన మావోడు చాలా ధైర్యంగనే ఉన్నట్టు కనిపించిండు. ప్రభుత్వం వారు మన రుణాల్ని మాఫీ చేస్తరట... నకిలీ విత్తనాలు, నకిలీ మందులు మార్కెట్‌లోకి ఇక రాకుండ చేస్తరట అని నాతో చాలా ఉత్సాహంగా చెప్పిండు.

ఇది జరిగిన కొద్దిరోజుల తర్వాత బ్యాంకు వాళ్ళొచ్చి మా ఆయన్ను వడ్డీతో కలిసి 50 వేలయిన అప్పును ఎప్పుడు తీరుస్తవని అడిగింగ్రు... ఇప్పట్లో తీర్చలేనని మావోడు చెప్పంగనె వాళ్ళు ఆయనను దారుణంగ అవమానించింగ్రు. "ప్రభుత్వమే మా అసుంటి పేద రైతుల అప్పుల్ని మాఫీ చేస్తద"ని మా ఆయన చెప్పంగనె "నువ్వు ఛస్తే నీ అప్పుల్ని మాఫీ చేస్తరు" అన్నరట బ్యాంకువాళ్ళు.

అంతే – మా ఆయన ఆ క్షణంలోనే చావడానికి నిర్ణయించుకున్నట్టుంది.

మా చెలక దగ్గర్నించి బ్యాంకు వాళ్ళు వెళ్ళిపోంగనె పురుగుల మందు తాగేసిండు. హాస్పిటల్‌కు చేర్చేలోపల్నే చివరిశ్వాస విడిచిండు.

మావోడు చచ్చిపోయినంక కొత్త ప్రభుత్వం వచ్చింది. ఉచిత కరెంటిచ్చింగ్రు. రైతుల రుణాలన్నీ మాఫీ జేసింగ్రు.

మావోడు ఇంకో కొద్దిరోజులు బతికితే ఈ వార్తలు విని ఎంత సంతోషించే టోడో! మనక్కూడ మంచిరోజులొస్తయని నేనెంత మొత్తుకున్ననో... చెవిటోని ముందు శంఖం ఊదినట్టే అయింది. వాడు నా మాటల్ని పట్టించుకోలేదు. యముడు పిలుస్తన్నడని అఘమేఘాల మీద యెళ్ళిపోయిండు. ఆడదానికి మొగడనెటోడొక దుండాలెగద... మొగుడులేని ఆడదాన్నని అందరు నన్ను చులకన జెయ్యబట్టిరి. నేను, నా పిల్లలు ఈ పాపపు ప్రపంచంల ఎట్ల బతకాల్నో నువ్వే చెప్పు... వాడింకో కొద్దిరోజులు ఆగితే వాని సొమ్మేంపోయేడిది... బాంకోళ్ళు నువ్వు చస్తెనే నీ రుణం మాఫయితది అనంగనే మొగోనికి రోషం పొడుచుకొచ్చి పెడాల్న చచ్చిండు... వాడు చచ్చుడుతోటి వాని సమస్యలన్ని ఖతమైపోయినయి గని మేమెట్ల బతుకుతమొ వాడు ఆలోచించలేదు... వాని స్వార్థం వాడు చూసుకున్నడు. వానోలె ఇంకెవ్వడు గిట్ల ఆత్మహత్యలు చేసుకొని చావొద్దు... పరిస్థితులు ఎప్పుడు ఒకతీరుగనే ఉండయి... ఎంత దురదృష్టవంతునికైనా మంచిరోజులొస్తయి. నీ పేపర్ల గిదే రాయి. ఇంకో నాల్గు రోజులు బతికితే మాకూ మంచిరోజులొచ్చేటివి. ఉచిత కరెంట్, రుణాల మాఫీలు ఎంత మంది రైతులకు మేలుజేసినయో చూస్తున్నం కద... మావోడు బతికుంటే వాడూ మాకు మంచిరోజులొచ్చినయని ఎంత మురిసిపోయెటోడో...

వానోలిగె నేను చావ. ఉన్న భూమి అమ్మేసి పట్నంబోయి నా పిల్లల్ని చదివించుకుంట"

ఇదంతా చెప్పి ఆమె తన కథను ముగించింది.

✧✧✧✧✧

– 'సురభి' (మాసపత్రిక)